# ఈ జగత్తే దైవ స్వరూపము

పంకజాక్షుని చింత పలుమారు చేయక
పరుల నిందించుట పాడిగాదు
విష్ణు సంకీర్తనల్ వీనుల వినకుండ
పరుల స్తుతులు చేయ భ్రాంతికాదె
శేషశయను జాల చెలగి కీర్తింపక
పరుల కీర్తించుట భావ్యమగునె
దామోదరుని రూపధ్యానంబు చేయక
పరుల దూషించుట పాటియగునె
శ్రీరమానాథు నెప్పుడు చిత్తమందు
తలచువారికి మోక్షంబు తథ్యమప్ప
ఇంతకన్నను వేరెద్ది ఎఱుకపఱతు
పరమపావన శివరాత్రి పర్వమందు

మౌళిగుల్కెడు చంద్రమఃఖండ కళతోడ
బెడగారు గుల్కెడు జడలతోడ
జడలతో ప్రవహించు చదలేటి జిగితోడ
డంబైన ఫాలనేత్రంబుతోడ
నల్లనేరెడువంటి నల్లని మెడతోడ
కరమున నాగ కంకణముతోడ
నడుమున చుట్టిన నాగ చర్మముతోడ
మైనిండ నలదు భస్మంబుతోడ

sri sathyasai vachanamrutam

**నుదుట దీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో**
**తాంబూల రాగాధరంబుతోడ**
**ఆరు శాస్త్రములందున నందగించి**
**నల్లకలువల హసియించి కొల్లలాడు**
**మెఱుగుచామనచాయ మేనితోడ**
**పర్తిపురివాసుడు నేడు సాక్షాత్కరించె**

ప్రేమస్వరూపులారా!

ప్రాచీన మహర్షులు భగవదన్వేషణ నిమిత్తమై సల్పిన పరిశోధనల ఫలప్రసాదములే ఉపనిషత్తులు. ఈ ఉపనిషత్తులయొక్క ప్రధానమైన, ప్రప్రథమమైన బోధ 'ఈశావాస్యమిదమ్ జగత్', ఈశ్వరుడు నివశించేది యీ సమస్త ప్రపంచము. జగత్తనగా మనము పుట్టిపెరిగి తిరిగి పోయే లోకము. ఈ లోకమునకాధారము భూమి. ఎడతెరిపి లేకుండా యింటా బయట సర్వత్ర అహోరాత్రములు గాలి వీస్తున్నది. కాని, మనకు కన్పించుటలేదు. పగటి వెలుతురులో ఆహార నిద్రలతో, కార్యకలాపములతో కాలము గడచిపోతుంది. రాత్రి నిశ్చింతగా జగత్తు నిద్రిస్తుంది. ప్రపంచములో ఏదో ఒక వైపున ఎప్పుడూ ఒక విధమైన సృష్టి స్థితి లయలు జరుగుతూనే వుంటాయి. పుణ్యము, పురుడు, పెండ్లి, పేరంటాలు, రోగాలు, మరణాలు మొదలైన సంఘటనలు క్షణక్షణమునకూ జరుగుతూ నవ్వులతో, ఏడ్పులతో కాలము గడచిపోతుంది. దీనికి విరామమన్నదే లేదు. బండలు కరగించే ఎండలు, కుండపోతవంటి వర్షము, జలము గడ్డకట్టించే చలి, శీతోష్ణములు, యిట్టిపరిణామములతో కాలమనే సంవత్సరస్వరూపము కదలిపోతూ వుంటుంది. మానవునకు యీ విధమైన దృశ్యకల్పితమైన జగత్తును అర్థం చేసుకోవటం చాలా కష్టం.

**జగత్తులో సర్వమునకు మూలాధారమైనది దివ్యతత్త్వము**

ప్రాణికి పుట్టుకతోనే ఆకలి ప్రారంభమవుతుంది. నాభికోశమును కోసినంతనే బిడ్డ కెవ్వున ఏడుస్తుంది. తేనో లేక పాలో నాలుకకు రాసినప్పుడు ఆకలి తీరి చల్లగా నిద్రిస్తుంది. మానవునికి ప్రధానమైనది ఆహారము. ఈ ఆహారము ధాన్యము చేతనే లభిస్తుంది కాని

srisathyasaivachanamrutam

మరొక మార్గంలో మనకు లభించదు. ఈ ధాన్యము నీటివల్లనే అభివృద్ధి అవుతుంది. నీరును త్రాగి భూమి పంటనందిస్తుంది. ఏ మంత్ర తంత్రాలతోగాని, మరేవిధమైన ధనముచేతగాని కడుపునిండదు. ఆకలి తీరదు. కనుక మొట్టమొదట మానవుడు కృషి కలాపనిమిత్తమై తాను నడుము వంచుతాడు. ఈ కృషి కలాపమునందే మానవుడు తన జీవితమును ప్రవేశపెడతాడు. పాడిపంటలను అభివృద్ధిగావించుకుంటాడు. తద్వారా కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర, ఒంటినిండా వస్త్రము, యింటినిండా పిల్లలు. ఇదియే జీవితముయొక్క కర్తవ్యమని భావిస్తాడు మొదట్లో. కాని, క్రమక్రమముగా మానవుని తెలివితేటలు పెరుగుతాయి. గుడిసెలు భవనములవుతాయి. ఈనాడు జనాభా పెరిగిపోయింది. పల్లెలు పట్టణాలుగా మారుతూవచ్చాయి. ఈ తెలివితేటలయొక్క వికాసముచేత మానవుడు తెలుసుకొనవలసినవన్నీ తెలుసుకుంటున్నాడు. అయితే యిందులో తనకు తెలియనివికూడను కొన్ని వున్నవని తెలుసుకున్నాడు. తాను చేయలేనివికూడను కొన్ని వున్నాయని తెలుసుకున్నాడు.

మానవుడు భూమిని సృష్టించలేడు. నీరును సృష్టించలేడు. గాలిని పట్టలేరు. గట్టిగా ముక్కునోరు మూసుకుంటే ఉక్కిరిబిక్కిరి అవుతాడు. చెట్టుకొమ్మలు ఒకదానికొకటి రాసుకున్నప్పుడు అగ్ని పుడుతుంది. కఱ్ఱలో అగ్నివుండికూడా కఱ్ఱను కాల్చలేకుండా పోతున్నదే అని ఒక అద్భుతంగా భావించాడు, ఆనాటి మానవుడు. ఇది మానవుడు చేయలేని పని. నిరంతరము జనన మరణములు జరుగుతున్నాయి జగత్తులో. వీటి రహస్యమేమిటో యింతవరకు ఎవరూ గుర్తించలేకపోతున్నారు. ఈ జననమునకు, మరణమునకు కారణమేమిటో గుర్తించుకోలేకపోతున్నారు. దీనియొక్క అంతరార్థమేమిటో అర్థం చెప్పలేకపోతున్నారు. కనుక, మానవులు తమ తెలివితేటలచేతగాని, శక్తిసామర్థ్యములచేతగాని, విద్య అధికారములచేతగాని చేయలేనివి యీ జగత్తులో వున్నాయని గుర్తించారు. ఈ అన్నింటికి వెనుక ఏదో ఒక మహత్తరమైన శక్తి వున్నదని వూహిస్తూవచ్చారు. ఆ శక్తియే మానవాతీతమైన శక్తి అని విశ్వసించారు. ఏది లేకపోతే మానవత్వమనేది యీ జగత్తులో నిలువలేదో, ఏ ప్రాణికూడను యీ జగత్తునందు జీవించలేదో, ఏ వృక్షములుకూడను యీ జగత్తునందు అభివృద్ధి గాంచలేవో ఆయొక్క

ఆధారతత్వాన్ని విచారించాలని పూనుకున్నారు. వీరి విచారణలు, పరిశోధనలు కేవలము మూఢనమ్మకములు కానేరవు. కేవలము భ్రాంతి కానేరదు. తమయొక్క మహత్తరమైన తపః శక్తులచేతనే వీటిని తెలుసుకొనుటకు ప్రయత్నిస్తూవచ్చారు. ఇది ఒక విధమైన దైవాన్వేషణగా భావిస్తూవచ్చారు. అప్పుడుకూడను కలదని కొందరు, లేదని కొందరు, మధ్యేమార్గములో వుండే జనులుకూడను ఆవిర్భవించారు. ఈ విధమైన తర్కవిచారములచేతను, అనేక విధములైన పరిశోధనలచేతను దైవత్వమును అనేక విధములైన మార్గములో వారు అన్వేషణ జరుపుతూ వచ్చారు.

## సూర్యుడు ప్రత్యక్ష దైవము

మన నిత్యజీవితములో నిత్యకర్మల నాచరించటానికి, జీవిత రహస్యాన్ని గుర్తించటానికి ఆధారపురుషుడు సూర్యుడు అని మొదట విశ్వసిస్తూవచ్చారు. సూర్యుడే లేకుండిన దినములే లేవు. సూర్యుడు లేక ఏ ప్రాణికూడను ఉద్భవించటానికి అవకాశములేదు. సమస్తప్రాణులు, వృక్షములు, పశుపక్షులు యీయొక్క సూర్యోదయముచేతనే అభివృద్ధి గాంచుతున్నవి. కమలములు, కలువలుకూడను సూర్యోదయ, సూర్యాస్తమయములచేతనే విచ్చుకుంటున్నవి. కనుక, సమస్త సృష్టికి పోషణము, క్షీణమునకు మూలకారకుడు సూర్యుడని విశ్వసిస్తూవచ్చారు. ప్రత్యక్షస్వరూపుడు భగవంతుడు సూర్యుడని ఆనాటినుండి ఆరాధనలు ప్రారంభము చేశారు. కనుకనే ఆనాటి మహర్షియైన విశ్వామిత్రుడు గాయత్రి మంత్రములో సూర్యునికే ప్రధాన దేవత స్థానమునిచ్చాడు.

## 'శివః' అనగా త్రైగుణ్యరహితుడు అని అర్థము

అంతర్ బహిర్ తత్త్వములందు, స్వరూప స్వభావములందు, ప్రత్యక్ష అప్రత్యక్ష తత్త్వములందు దైవత్వమనే ఒక శక్తి వ్యాపించి వున్నదనే సత్యాన్నికూడా ఆనాడు వారు విశ్వసిస్తూవచ్చారు. తదుపరి దాని అంతరార్థమును విపులంగా జగత్తునకు వ్యాపింపచేసే నిమిత్తమై మహర్షులు తపస్సులాచరిస్తూవచ్చారు. 'వేదాహమేతమ్ పురుషం మహాంతం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' అనే రీతిగా గుర్తించి ఆంధకారమనే చీకటికి ఆవలనున్న తేజోవంతుడైన పరమాత్ముని మేము చూశాము. జనులారా! మీరుకూడా చూసి తరించండి,

srisathyasaivahini amrutam

రమించండి, వరించండి, అని ప్రబోధలు సల్పుతూ వచ్చారు. ఆ తేజోవంతుడు నిస్వార్థపరుడు. ఆ తేజోమయుడు మంగళస్వరూపుడు. ఆ తేజోవంతుడు గుణరహితుడు. కనుకనే అతనికి ఒక క్రొత్తపేరును పెడుతూవచ్చారు. 'శివః' అనగా త్రైగుణ్యరహితుడు అని అర్థము. అనగా త్రిగుణములు లేనివాడు. అతనే త్రైగుణ్యరహితుడు. గుణములు లేనివాడు కనుకనే యితను పరిశుద్ధుడు. గుణములే అశుద్ధతను కల్పించుచున్నవి. భగవంతునికి గుణములు లేవు కనుకనే అతను పరిశుద్ధుడు, నిర్గుణుడు, నిరంజనుడు, నూతనుడు, నికేతనుడు. ఇలాంటి తత్త్వాన్ని వారు వర్ణిస్తూ శివునికి పేరును పెట్టి శివః అని పిలుస్తూవచ్చారు.

**సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు, సర్వవ్యాపకుడైన పరమాత్ముని తెలుసుకోవటం ఎవరికి సాధ్యము కాదు**

ఇతనికి గుణములు లేవుకాని సర్వశక్తులు వుంటున్నాయి. ఇతను పరిశుద్ధుడేగాని సర్వత్ర వ్యాపించి వుంటున్నాడు. ఇతను సర్వైశ్వర్య స్వరూపుడు. షడ్గుణైశ్వర్య స్వరూపుడు. 'ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, త్యాగము, జ్ఞానము, కీర్తి యీ ఆరు విధములైన సంపత్తులు యితని దగ్గర వున్నవి', అని వారు అనుభవరీత్యా గుర్తించి అతనికి రెండవ పేరు పెడుతూ వచ్చారు. అదే 'ఈశ్వరః' అని. 'ఈశ్వరః' అనగా సకలైశ్వర్య స్వరూపుడు. జ్ఞానమొక ఐశ్వర్యము. జీవితమొక ఐశ్వర్యము, అన్నీకూడను ఐశ్వర్యములే. ఆయువుకూడను ఐశ్వర్యమే. ధన, కనక, వస్తు, వాహనాదులే కాకుండా మానవత్వమునందున్న దివ్యగుణములుకూడను ఒక ఐశ్వర్యముగానే నిరూపిస్తూవచ్చారు, ఆనాటి ఋషులు.

ఇంతటితోనే వారి పరిశోధనలు ఆగలేదు. అతనిని ఆరాధించి, నమ్మి, భజించి, పూజించి, ఆశ్రయించినవారిని రక్షించేవాడనికూడా విశ్వసిస్తూవచ్చారు. ఆశ్రయించేవారిని ఆవరించే స్వభావము కలదు కనుకనే అతనిని 'శంకరః' అన్నారు.

అతనియొక్క సంకల్పములకుగాని, అనుగ్రహములకుగాని కారణములే మాత్రము వుండనక్కరలేదు. అతని సంకల్పమే అతని కారణము. అతను సంకల్పించుకున్న భావములే సమస్త సృష్టి స్వరూపములు. కనుకనే తనయొక్క సంకల్పాలకు స్వతంత్రుడైవుండుటచేత

sri sathyasai vachanamrutam

యితనికి మరొక పేరుకూడను పెడుతూవచ్చారు. 'స్వయంభుః' అన్నారు. తనకు తాను సంకల్పించుకొని శరీరము ధరించేవాడు కనుకనే 'స్వయంభుః' అని పేరు పెట్టారు.

ఇంతమాత్రమేకాదు. మానవులయొక్క కోరికలను, కష్టసుఖములను గుర్తించి వారి ప్రార్థనలను, వారి తపశ్శక్తిని తాను ఆలకించి ధర్మసంస్థాపననిమిత్తమై అవతరించటానికికూడను అతనికి సంపూర్ణ స్వతంత్రమున్నదని వారు భావించారు. ఈ విధమైన అనుభూతిని తాము గుర్తించుకొటంచేత అతనికి మరొక పేరునుకూడను పెడుతూ వచ్చారు. 'సంభవః' అన్నారు. అనగా ధర్మగ్లాని కల్గినప్పుడు సంభవామియుగేయుగే, 'ప్రతి యుగమునందు నేను స్వేచ్ఛగా వచ్చి ఆవరించిన కష్టములను, బాధలను నివారణ గావించగలను'. 'సంభవః' అనగా అతనియొక్క స్వతంత్రమునకు మరొక పేరు. ఒక్కడే పెక్కు జలపాత్రలయందు, పెక్కురూపములుగా దర్శింపజేసేవాడు సూర్యుడు. సూర్యుడు ఒక్కడే అయినప్పటికిని జలముతో నింపిన ప్రతి పాత్రయందుకూడను ఒక్కొక్కడుగా రూపొందింప జేసుకుంటాడు. అదే విధముగనే మానవునియొక్క దేహములన్నియుకూడను ఒక్కొక్క పాత్రగా భావిస్తూవచ్చారు ఋషులు. ఈయొక్క పాత్రలయందు భావములనే జలమును నింపుకుంటూ వచ్చారు. ప్రతి మానస సరోవరమునందు యీయొక్క దివ్యతేజమైన సూర్యతత్త్వమే ప్రకటిస్తూ వచ్చింది. ప్రదర్శిస్తూ వచ్చింది. అదే విధముగనే భగవంతుడు సర్వజీవులయందు సూర్యరూపముతో వుంటున్నాడనే భావమును గుర్తించి అతనికి యింకొక పేరు పెడుతూ వచ్చారు. అదే 'ఆదిత్యః', అనగా ఒక సూర్యుడే అనేక పాత్రలయందు తన ఆకారమును ప్రకటించినట్టుగా భగవంతుడు ఒక్కడే అయినప్పటికిని అన్ని దేహములయందు, అన్ని జీవరాశులయందు తాను ప్రకటితమవుతున్నాడనే సత్యాన్నిచాటుతూ వచ్చారు మహర్షులు. అయితే యీ సర్వశక్తిమయుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడైన యీ పరమాత్మను తెలుసుకోటం ఎవ్వరికి సాధ్యముకాదని తెలుసుకున్నారు.

## ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణములు

ప్రమాణములు మూడు వుంటున్నవి. ప్రత్యక్షప్రమాణము, అనుమానప్రమాణము,



srisathyasaivachanamrutam

శబ్దప్రమాణము. ప్రత్యక్షప్రమాణమనగా యిందులో యే విధమైన లింగభేదములు అతనికి లేవు. ఇలాంటి విషయమునకు తాను దూరమైనవాడు కనుక యితను యెట్టివాడు, ఎలాంటివాడు అని చెప్పుటకు సాధ్యముకాదు. ఎట్టి ప్రత్యక్ష ప్రమాణములకుకూడను తాను చిక్కనివాడు. 'యద్భావం తద్భవతి'. తన భావములనే యీ బాహ్య స్వరూపముగా దర్శిస్తూ వస్తూన్నారుగాని నిత్యమైన స్వరూపాన్ని యీ ప్రమాణములతో తాము చూడలేరనికూడను గుర్తించుతూవచ్చారు, ఋషులు.

అనుమాన ప్రమాణమనగా మనము యిక్కడనుండి చూచినప్పుడు దూరంగా ఒక కొండలో యేదో కొంచెం పొగ వస్తుంటాది. పొగను ఆధారము చేసుకొని అక్కడ నిప్పు వుండవచ్చు అని మనము భావిస్తున్నాము. ప్రాకృతమైన పదార్థములయందు యీ అనుమానప్రమాణము కొంతవరకు నిజము కావచ్చునుగాని పరతత్త్వమునందు యిలాంటి అనుమానమునకు విషయమే లేకుండావున్నది. ఏ శక్తిని చూచి నీవు భగవంతుడని విశ్వసించగలవు? ఆ శక్తి భగవంతునిదే అని నీవు ఎట్లు గ్రహించగలవు? 'మానవాతీతమైన శక్తి' అని నీవు భావించినప్పటికిని, అన్ని శక్తులకును ఒకటి ఆధారభూతమై వుంటున్నది. నీవు ఒక విత్తనమును చేతిలో వుంచుకున్నప్పుడు విత్తన స్వరూపమును నీవు చూడవచ్చునేగాని ఆ విత్తనములో వున్న వృక్షమును నీవు చూడలేవు. ఫలానా విత్తనము ఫలానా విధమైన వృక్షముగా వర్ధిల్లుతుందనేది నీ భావమేగాని అది సత్యముకాదు. అదే విధముగనే ప్రత్యక్షప్రమాణమే కాకుండా యీ అనుమానప్రమాణమునకుకూడను యేమాత్రము అవకాశము లేకుండా వుంటుండాది, యీ దైవత్వములో.

ఇంక శబ్దప్రమాణము. శబ్దప్రమాణమే వేదము. వేదము కేవలము వర్ణించవచ్చునేగాని దానియొక్క స్వరూపమును నిరూపించలేదు. అందువల్లనే 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్త్వ మానసుః', అని చెప్పింది. అన్నీ త్యాగము చేస్తేనే నీకు యీ అమృతత్త్వమనే దైవత్వము లభిస్తుందని చెప్పింది. అంతకంటే మరొకటి తెలపలేకుండా పోయింది. అందువలననే వేదాంతమునందు 'నేతి, నేతి' not this, not this అని చెబుతూ వచ్చింది. ఈ విధమైన పరిశోధనలు సలిపి భగవంతుని ప్రత్యక్షంగా కాని, అనుమానముగా



srisathyasaivachanamrutam

కాని శబ్దరూపములోగాని నిరూపించటము సాధ్యముకాదని అతనికి యింకొక పేరు పెడుతూ వచ్చింది. అదే 'అప్రమేయః' అని. అనగా ఎట్టి ప్రమాణములకు నీవు చిక్కని వాడవు, అప్రమేయుడవు అని చెప్పింది. ఏదో యివన్నీ మనకు తెలియనటువంటివిగా శివః , శంకరః, సూర్యః, ఆదిత్యః అనే పేర్లతో యీ జగత్తునకు సరైన అర్థములు చెప్పటము అసాధ్యమవుతుందని మరొక రీతిగా యితనిని విచారణ చేస్తూ వచ్చారు.

## భగవంతుడు సృష్టి, స్థితి, లయ కారకుడు

ఇతను సృష్టిని చేస్తున్నాడు. అంతటితో తాను నిల్చటంలేదు. దానిని పోషిస్తున్నాడు, ఎంతోదయతో పోషించుతూ వచ్చిన దానిని తిరిగి శిక్షిస్తూ వస్తున్నాడు. అనగా కేవలము యితను సృష్టి, స్థితి, లయములకు కారణమై వున్నాడు. ఈ మూడింటికి తగిన సర్వశక్తులుకూడను యితనియందు యిమిడివుంటున్నవి. నవ్వించగలడు, ఏడ్పించగలడు. శ్రీమంతుడుగా చేయగలడు, పేదవానిగా మార్చగలడు. సర్వము యితనియందే యిమిడి వుంటున్నవి. అనుగ్రహించగలడు, ఆగ్రహించగలడు. ఇలాంటి లౌకిక, అలౌకికమైన సర్వశక్తిమయుడు కనుక యితనికి యింకొక పేరు పెట్టాలని భావిస్తూ వచ్చారు ఋషులు. ఇది సర్వసామాన్య మానవులు పిల్చి ఆరాధించి, ఆశ్రయించి, ఆనందించటానికి సులభమైన పేరుగా వుండాలని భావించారు. అదే 'భగవన్' అని. భగవాన్ అనగా ఐశ్వర్యముతో, ధర్మముతో, యశస్సుతో, సిరితో, జ్ఞానముతో, వైరాగ్యముతో, సృష్టిస్థితిలయములతో సర్వవిషయమైన శక్తులతోకూడినవాడు భగవాన్ అని నిర్ణయిస్తూ వచ్చారు.

## రాగ, ద్వేషములకు ఆవలనే దైవత్వము లభిస్తుంది

తదుపరి వర్ణక్రమములోపల సంఖ్యాశాస్త్రములో ప్రవేశిస్తూ వచ్చారు ఋషులు. శివరాత్రి. శివ మంగళకరమైనది. ఎలాంటి రాత్రి? చీకటితో నిండినది. చీకటికి ఆవలనున్నవాడు, శివుడు. కనుక, చీకటిని దాటుకున్న తరువాతనే శివుని దర్శించటానికి వీలవుతుంది. రాగద్వేషములకు ఆవలనే దైవత్వము లభిస్తుంది. కనుక, చీకటికి ఆవలనే శివుడు వుంటున్నాడు. చీకటి అంటే ఏమిటి, శివుడంటే ఏమిటి? శివః రక్షించేవాడు,



sri sathyasai vachanamrutam

పోషించేవాడు, ఆదరించేవాడు, అనుగ్రహించేవాడు, స్వార్థరహితమైనవాడు, ఆనందమయమైనవాడు, అనుగ్రహముతోనిండినవాడు, పరిశుద్ధమైనవాడు, మంగళమైనవాడు. యిలాంటి వాడు చీకటిలో వుండటంలో అంతరార్థము ఏమిటి? నిత్యము మనము చూచే రాత్రులందు చీకటి, వెలుతురు రెండుకూడను మనము అనుభవిస్తున్నాము. అయితే యీ శివరాత్రి దినము మాత్రము దీనికి రాత్రి అనటానికి ప్రత్యేకమైన అర్థము వుంటున్నాది. మాఘ బహుళ చతుర్దశి, అమావాస్య రెండునుకూడిన రాత్రి. ఎరాడే చెప్పినట్టుగా 'చంద్రమా మనసో జాతః చక్షో సూర్యో అజాయత'. చంద్రునకు యీనాడు 14వ దినము. రేపటి దినము 15వ దినములో లయమై పోతాడు. అనగా 14,15 రెండూ చేరిపోతాయి. దీనినే చంద్రునకు కళలు అని చెబుతూ వచ్చారు. 15 కళలు తాను దాటుకొని యింక ఒక్క కళలో తాను లీనము గావటానికి సిద్ధముగా వుంటున్నాడు. కనుక, మానవుడు యీ రాత్రి భగవంతునకు అతి సమీపములో వుంటాడు. ఈ సమీపములో వుండిన మానవుని దూరము చేస్తూ వస్తున్నాయి కొన్ని దూతలు. ఈ దూరము చేసే దూతలు ఎవరని వారినికూడను విచారణ చేస్తూ వచ్చారు మహర్షులు.

**ఇంద్రియనిగ్రహమే మోక్షమునకు, దైవదర్శనమునకు మూలాధారము**

ఇందులో సంఖ్యాశాస్త్రమును, వర్ణక్రమమును అనుసరిస్తూ వచ్చారు. 'శి' అనగా దీనికి 5 నంబరు. 'వ' అనగా 4 నెంబరు, 'ర' అనగా 2 నంబరు. 5+4+2=11 అయింది. ఈ 11 ఎవరని తిరిగి తపశ్శక్తితో పరిశోధనలు సలుపుతూ వచ్చారు. వారే 'ఏకాదశరుద్రులు', అని పేరు పెడుతూ వచ్చారు. రుద్రులనగా ఏమిటి? 'రుయతేయితి రుద్రః' అని, ఏడిపించేవారు రుద్రులు. ఏ విధముగా ఏడ్పిస్తున్నారు? ఈ రుద్రులు బుద్ధితో చేరి మానవుని వాంఛలను సంసారమువైపు మరలుస్తూ వచ్చారు. ప్రాపంచిక సంబంధమైన భావములలో, రాగములలో ప్రవేశింపజేస్తూ వచ్చారు. మానవుని దశేంద్రియములను సంసారమువైపుకు మరలుస్తూ వచ్చారు. దైవానికి దూరము చేస్తూ దయ్యానికి సమీపము చేస్తూ పోతున్నారు అనే ఆవేశముచేత వీరికి రుద్రులు అని పేరు పెడుతూ వచ్చారు, ఋషులు. "శివరాత్రి దినము యీ రుద్రులను యెవరు సాధనాపూర్వకముగా అరికట్టుదురో వారికే దైవత్వము

srisathyasaivachanamrutam

ప్రాప్తిస్తుంది", అని నిర్ణయము చేస్తూ వచ్చారు. అనగా యింద్రియనిగ్రహమే మోక్షమునకు, దైవదర్శనమునకు మూలాధారమని. ఈ యింద్రియ నిగ్రహము అంత సులభమైనదికాదు. సాక్షాత్తు అర్జునుడే 'చంచలం హి మనః కృష్ణ ప్రమాది బలవదృఢమ్', అని వాపోయాడు. 'ఇది చాలా ప్రమాదమైనది, చాలా బలమైనది, దీనిని నేను నిగ్రహించుకోలేను స్వామీ!' అన్నాడు. ఈ విధమైన బాధ ఋషులకుకూడ తెలుసు. బాగా వారు అనుభవించినవారు. అందువలననే 'అయ్యా! నీయొక్క జీవితములో ఆయుప్రమాణము యెంతనో అంతకాలము నిగ్రహించి వుండటానికి వీలుకాదు. శివరాత్రి ఒక్కరాత్రి అయినాకూడను నీవు యీ యింద్రియములను నిగ్రహించుకుంటే నీవు దైవత్వమును పొందగలవు', అని చెప్పి ప్రత్యేకమైన రాత్రిగా భావిస్తూ వచ్చారు. మానవునకు యేపని లేనప్పుడు యీ యింద్రియములకింక పట్టపగ్గాలు చాలవు. ఇష్టము వచ్చినట్లు పరుగెత్తుతుంటాయి. కనుకనే యీ శివరాత్రి దినము రాత్రంతయు భగవచ్చింతనచేతను, భగవద్భావముచేతను, భగవదారాధనచేతను కాలము గడిపినప్పుడు యీ యింద్రియములు మరొక దీనిలో ప్రవేశించటానికి వీలుండదని రాత్రంతయు దైవచింతనచేత, దైవస్మరణచేత, దైవభావముచేత కాలముగడుపు, ఇది భగవంతునికి అతిసమీపమైనకాలము. ఈ కాలములో నీవు దైవానుగ్రహనికి పాత్రుడు కాగలవని నిర్ణయిస్తూ వచ్చారు.

కాని యీనాడు తెలివితేటలు కల్గిన ఆధునికులంతాకూడను మేలుకోటం ప్రధానం, అని భావించి వ్యర్థకాలక్షేపము చేస్తుంటారు. ఏవిధముగానైనా ఈ రాత్రిని పవిత్రము గావించాలనే సద్భావములు వారిలో పుట్టవు. శివరాత్రిదినము జాగరణ చెయ్యాలి అని నిర్ణయించుకుంటారు. ఏవిధముగా చేయటము? మూడు సినిమాలకు వెడతాము, ఏతెల్లవారుఝామో అవుతుంది. ఇంటికి వచ్చి స్నానంచేసి టిఫిన్, భోజనము చేస్తాము. ఇంకా కొంతమంది రాత్రి అంతా ఏ విధముగా గడపాలి అని తమ dears and nears తో కలసి పేకాట ఆడుతూంటారు. ఇంకా కొంతమంది అమ్మలక్కలు చేరతారు, జూదాలు ఆడుతూ కూర్చుంటారు. అందువలననే

**"పేకాటనాడుచు ప్రీతితోనారాత్రి**

గడపినందుకే జాగరమగునా
చేపల కొరకునై చెరువులో జాలర్లు
పొంచి చూచెడు దృష్టి ముక్తియగునా
తప్పసారాయి త్రాగి తన మేను మరచిన
మాత్రాన తన్మయత్వమగున
భార్యపై అలిగి పస్తుపరుండిన అది
గొప్పఉపవాసమగున"

అన్నారు. ఇదీ యీనాడు మనం చేస్తున్న ఉపవాసము, జాగరణ. ఇదికాదు. ఈ రాత్రి పరిశుద్ధమైన, పవిత్రమైన, నిర్మలమైన, నిశ్చలమైన, నిస్స్వార్థమైన పరతత్వాన్ని చింతిస్తూ, ప్రేమిస్తూ, ఆరాధిస్తూ ఆనందమును అనుభవించటమే నిజమైన జాగరణ. ఇలాంటి జాగరణను మనము యీనాడు సరైన అర్థమును గుర్తించుకొనలేక మనకాలమును వ్యర్థము గావించుకొనటమే కాకుండా జీవితమునుకూడను నిరర్థకము గావించుకుంటున్నాము.

**Faith is beyond reason**

ప్రాచీన మహర్షులు భారతీయ సంస్కృతిని అనేక విధములుగా కొనియాడి దానియొక్క నిజస్వరూపాన్ని ఆచరించి, ఆనందించి, జగత్తునకు అందిస్తూ వచ్చారు. కాని, భారతీయ సంస్కృతి అంటే యేమిటో తెలియనివారుకూడను అనేకమంది వున్నారు. మనయొక్క సాంప్రదాయమేమిటి? మన సంస్కృతి ఏమిటి? మనయొక్క సనాతన ధర్మమేమిటి? ఈ మూడు తెలియనివాడు భారతీయుడని చెప్పుకోవడానికికూడ అర్హుడుకాడు. కాలముచే మారనిది, చరిత్రతో మాయనిది, ప్రళయముతో తరగనిది, సృష్టితో పెరగనిది ఏ సత్యరూపమైతే వున్నదో ఆ సత్యరూపముయొక్క రూపకల్పనే యీ భారతీయ సంస్కృతి. ఈ సంస్కృతియొక్క అంతరాత్మయే సనాతన ధర్మము. ఈ సనాతన ధర్మమునకు తమ జీవితములనే అంకితము చేసుకొని సాధించిన సుధానిధి. ఆనాటి మహర్షులు కొన్నివిధములైన మూఢనమ్మకములచేతగాని, లేక అజ్ఞానముచేతగాని, లేక తెలియనితనముచేతగాని, దీనిలో ప్రవేశించలేదు. ఆనాటి మహర్షులు సర్వజ్ఞులు,

srisathyasaivachanamrutam

సర్వశక్తిమయులు, సర్వసంగపరిత్యాగులు, నిశ్చలహృదయులు, నిస్వార్థపరులు. అలాంటి మహనీయులు అనేక విధములుగా పరిశోధనలు సలిపి యీ పరమసత్యాన్ని జగత్తునకు తెలిపారు. ఈనాటి ఆధునిక యుగమునందు తెలివితేటలు పెరిగిపోయాయి. గుణము మాత్రము కన్పించటములేదు. అన్నింటికిని తర్కము. అన్నిటికిని హేతువాదము. హేతువు అంటే ఏమిటో తెలీదు. వాదానికి మాత్రము సిద్ధమవుతారు. హేతువాదానికికూడను ఒక హేతువు వుండాలనే సత్యము వారికి తెలీదు. కనుకనే యిలాంటి అజ్ఞానమయమైన మానవతత్త్వమందు దైవత్వము ఆవిర్భవించటము, దైవత్వాన్ని దర్శించటము అసాధ్యమైన విషయము. మనము విద్యలచేత మనయొక్క శక్తి సామర్థ్యములచేత, తెలివితేటలచేత ఆత్మస్వరూపుని దర్శించటము యేమాత్రము వీలుకాదనే సత్యాన్ని గుర్తించి వర్తించాలి. Faith అనేది ఒక్కటే! blind faith అని మరొకటిలేదు. ఈ faith కు no reason, no season. కనుక యిది beyond reason. ఆధ్యాత్మికము. దీనికి కారణాలు వెతకటము ఒక విధముగా మూర్ఖత్వమే?

మన అనంతపురమునకు సమీపమున శ్రీశైలం అని ఒక పుణ్యక్షేత్రము వున్నది. మీకందరికి తెలుసు. దానికి సమీపములో ఒక గ్రామం వున్నది. ఆ గ్రామములో ఒక తల్లి, ఏడు సంవత్సరముల బిడ్డ రాముడు అనేవాడు ఒక కుటుంబముగా జీవిస్తూ వుండేవారు. ఇతనిని వీధి బడులకు పంపి, ఆ తల్లి భర్తను కోల్పోటంచేత యీ యేకైక పుత్రుని ఏ విధముగా అయినా అభివృద్ధి పరచాలనే వుత్సాహంచేత అనేక విధములైన బాధలకు గురియై పిల్లవానిని చదివిస్తూ వచ్చింది. ఆ స్కూలులో అతనితో పాటు చదివే చిన్నపిల్లలంతా అతనిని రామన్న రామన్న అని పిలిచేవారు. ఇంతలో శివరాత్రి సమీపించింది. రాయలసీమలో శివరాత్రి పర్వదినమునకు ఆడబిడ్డలను, అల్లుళ్లను యింటికి పిలుచుకోటం వాడుక. అ పిల్లవాని క్లాస్‌మేట్సు అంతా కలసి ఆడుకుంటూ 'రేపటిదినము మా అక్కాబావలు వస్తారు. మాకు చాలా సంతోషము, మా యింట్లో పండగ చేసుకుంటాం', అని యీ రకముగా మాట్లాడుకుంటున్నారు. అప్పుడు యీ అబ్బాయికూడను 'నాకు అక్కాబావలున్నారా?' అని యింటికి వచ్చి అమ్మనడిగాడు. 'అమ్మా! నాకు అక్కవుందా? ఎక్కడవుంది? మాబావ ఎక్కడున్నాడు?' అని ప్రశ్నిస్తూ వచ్చాడు. ఈ పిల్లవాడు ఏమీ

తెలియని అమాయకుడు, పాపం! ఇతనికంటే పూర్వం ఒక ఆడబిడ్డ వుండేదిట. ఆ బిడ్డ అకస్మాత్తుగా మరణించింది. ఆ బిడ్డ జ్ఞాపకం వచ్చేటప్పటికి తల్లి కంటిధారలు కార్చింది. కాని, యీ దుఃఖకరమైన విషయాన్ని కుమారునికి చెప్పటం యిష్టంలేక కనులు తుడుచుకొని 'నాయనా! నీకు అక్కవుంది', అని ఓదారుస్తూ వచ్చింది. 'ఎక్కడవుందో చెప్పు, నేను పోయి పిలుచుకొని రావాలి. మా అక్కాబావలను పిలుచుకొనిరావాలి. మా స్నేహితులందరూ అక్కాబావలను పిలిపించుకుంటున్నారు. నేనూ నా అక్కాబావలను తెప్పించుకొవా'లని, పట్టుపట్టాడు. ఈ పోరును పడలేక తల్లి యేదో ఒకటి చెప్పి యితనిని సమాధానపరచి పంపే నిమిత్తమై 'మీ అక్కవుంది నాయనా, శ్రీశైలంలో. భ్రమరాంబ నీ అక్క, మల్లిఖార్జునుడు మీ బావ', అని చెప్పింది.

తల్లి మాటలను పూర్తిగా విశ్వసించాడు. ఇది మూఢనమ్మకం కాదు. హృదయపూర్వకముగా వచ్చిన నమ్మకము. 'అయితే అమ్మా! నేను, నీవు యిద్దరం వెళ్లి అక్కాబావను తీసుకు వద్దాము. మన యింట్లోకూడను శివరాత్రి చేసుకుందాం', అన్నాడు, ఆ పిల్లవాడు. సామాన్యమైన పిల్లవాడుకాదు, తల్లిచెప్పిన మాటలతో యేమాత్రం సంతృప్తి పడక అక్కాబావలను ఎలాగైనా యింటికి తీసుకొనిరావాలని పట్టుబట్టాడు. తల్లి తప్పించుకొనుటకై అనేక విధములైన యుక్తులు చెప్పింది. 'నాయనా! మనింట్లో శివరాత్రి చేయాలికదా అక్కాబావలు వస్తే అన్ని విధములా చేయాలి కదా. నేనూ వస్తే ఎలా అవుతుంది. నేను రావటానికి అవదు' అని చెప్పింది. ఆ పిల్లవాడు వదలలేదు. నేనే వెడతానన్నాడు. ఆ పిల్లవానిని తృప్తి పరచే నిమిత్తమై ఆ గ్రామములో ఎవరో యిద్దరుముగ్గురు పెద్దలు పోతుంటే వారితో యీ బిడ్డను శ్రీశైలం పంపింది.

నడచుకొని శ్రీశైలం చేరాడు. ఎక్కడ మాఅక్క యిల్లు, అని అడిగాడు. ఈ గ్రామస్థులతో యీ తల్లి ముందుగానే 'శ్రీశైలంలో భ్రమరాంబను, మల్లిఖార్జుని దర్శింపజేసి తిరిగి మీవెంట తీసుకురమ్మ'ని, చెప్పింది పాపం! ఆ బాలుని వెంటపోయిన గ్రామస్థులు మల్లిఖార్జుని దేవాలయము చూపి 'అదుగో! అదే మీ బావగారిల్లు', అని చెప్పారు. చూపించినారో లేదో 'బావా!బావా!' అని లోపల ప్రవేశించాడు. దగ్గరకుపోయాడు. పూజారులు అడ్డుపడ్డారు.

srisathyasaivachanamrutam

'బావా! నాతో మాట్లాడు, నాతో మాట్లాడు', అని అంటున్నాడు. ఉహూ! brother in law యేమీ పలుకలేదు. అప్పుడు ఆ పిల్లవాడు 'నేనెప్పుడూ అతనిని చూడలేదు, అతనెప్పుడూ నన్ను చూడలేదు. కనుక నన్ను ఎవరనుకున్నాడో మాబావ', అని పాపం ఏడ్చాడు. ఇంతలో పూజారులంతా ఎవరో పిచ్చిపిల్లవాడని బయటకు నెట్టారు. 'బావ ఎవరో వుంటారు. కాని అక్క మాత్రం నా అక్కనే కదా! అని నన్ను తప్పక గుర్తిస్తుంది. మా అక్కగారిల్లు యెక్కడ?' అని అడిగాడు. భ్రమరాంబ దేవాలయమునకు వెళ్లాడు. అక్కడకూడా 'అక్కా! అక్కా!' అని పరుగెత్తాడు, దగ్గరకు. ఏడ్చాడు, క్రిందపడి పొర్లాడాడు. 'అక్కా! మాట్లాడు, మాట్లాడు,' అన్నాడు. అక్కడకూడను యీ పూజారులు పిచ్చిపిల్లవాడని బయటకు తరిమేశారు. బయటకు వచ్చాడు. 'నా అక్కబావలను యింటికి తీసుకొనిపోకుండా పోతే నా తల్లి నన్ను ఎంత శిక్షిస్తుందో నా స్నేహితులంతా మా అక్కాబావలను తెచ్చుకున్నాము, నీ అక్కాబావలను తెచ్చుకోలేదని హాస్యం చేస్తారేమో'నని అతను చాలా బాధపడ్డాడు. వెంటపోయిన గ్రామస్థులు, వాళ్లపూజలు, పునస్కారములు, వాళ్లేదో చేస్తున్నారు. ఈ పిల్లవాడు తప్పించుకొని బయటకు వచ్చాడు. బయట ఎవరూలేరు. కొంతదూరము పోయి పెద్దగుండు ఎక్కాడు. నేను యీ విధముగా అక్కాబావలనింటికి తీసుకోకుండాపోతే నా తల్లి నన్ను అన్ని విధాలా హాస్యం చేస్తుంది. నా స్నేహితులందరూ నన్ను తమాషా చేస్తారు. నేనింక యీ విధముగా యింటికి పోను. అక్కాబావలు వస్తేసరి. లేకుంటే నేనిక్కడే చచ్చిపోతానని పెద్దగుండు ఎక్కి 'అక్కా, బావా!' అని అరిచాడు. అంత గాఢనమ్మకముతో వున్నాడు, యీ పిల్లవాడు. ఈ నమ్మకము యేనాటికి చెడపదు. ఆ గుండునుండి దూకి చచ్చిపోవాలని 'అక్కా! బావా!' అని అరచి దూకాడు. ఎక్కడినుండో 'మరిదీ! రామన్నా! మరిదీ! రామన్నా!' అని శబ్దం వచ్చింది. 'తమ్ముడూ! తమ్ముడూ', అని ఎక్కడనుండో ఒక స్త్రీ కంఠము వినిపించింది. వాడు దూకేటప్పటికి ఒకవైపున భ్రమరాంబ, మరోకవైపున మల్లిఖార్జునుడు ఆ పిల్లవానిని చేతితో పట్టుకొని నిల్చున్నారు. ఈ దర్శనమును యాత్రికులందరూ చూచారు. ఆ పిల్లవానిని ఎత్తుకొని సామాన్యమానవులలా ఆ గ్రామములో ప్రవేశించి, ఆ పిల్లవానిని యింటిలో విడచి, తల్లిచేసిన విందునంతా ఆరగించి తరువాత అంతర్ధానమైపోయారు.

అమాయకుడైన పిల్లవాని గాఢనమ్మకమును చూసి ఆత్మస్వరూపుడీవిధముగా

దర్శనమిచ్చాడని గుర్తించాలి. ఈ నమ్మకము అనేది ఎలాంటి దానినైనా సాధించటానికి సాధ్యమవుతుంది. ఈ నమ్మకాన్ని blind faith అనికాని, నిజమైన నమ్మకమనిగాని నిర్ణయించే అధికారము ఎవరికి వుంది? అందరూ అనుకోవచ్చు, 'ఏదో చిన్నపిల్లవాడు. అమాయకుడు' అని. వివిధమైన భావములతో అతనిని హాస్యాస్పదముగా చూడవచ్చు. ఇది మూఢనమ్మకముకాదు. పవిత్రమైన హృదయమునుండి ఆవిర్భవించిన స్థిరమైన, నిర్మలమైనభావము. కనుకనే ఆ పిల్లవాడు దూకిన స్థలములోపల మరిదిరామన్న అనేపేరుతో యిప్పుడక్కడ ఒక్క పెద్ద క్షేత్రంగా ఏర్పడింది. ఒక మందిరముకూడా కట్టబడింది. క్రమక్రమేణా మరిదిరామన్న అనేది మైదినిరామన్నగా మారింది.

**నిశ్చలమైన, నిర్మలమైన, హృదయము కలిగి స్థిరమైన విశ్వాసమును పెంచుకున్నప్పుడు భగవంతుని తప్పక దర్శించగలరు.**

కలియుగమునందు యిలాంటి భగవత్‌భక్తి కానరాదని భావిస్తారు. కాదు, కాదు. ఏ యుగమైనా కాని, నిశ్చలమైన, నిర్మలమైన, నిస్వార్థమైన, స్థిరమైన విశ్వాసము కలవాడు ఎక్కడైనా, ఏ నిమిషములోనైనా, ఏ స్థానములోనైనా భగవంతుని దర్శించటానికి అధికారిగా వుంటాడు. దైవత్వమనేది దేశకాలప్రభావముల కతీతమైనది. కనుకనే అన్నింటికిని మొట్టమొదట మన విశ్వాసాన్ని పెంచుకోవాలి. విశ్వాసములేనివాడు దేనిని సాధించలేడు. విశ్వాసము వున్నవాడు అన్నింటిని సాధించగలడు. కనుక, దైవాన్ని మనము పొందాలనుకుంటే విశ్వాసము అనే పునాది భద్రపరచుకోవాలి. నేను అప్పుడప్పుడు చెబుతూవుంటాను:

Where there is Confidence, there is Love
Where there is Love, there is Peace
Where there is Peace, there is Truth
Where there is Truth, there is Bliss
Where there is Bliss, there is GOD

నీకు భగవంతుడు కావాలనుకుంటే ఆనందము నీలో వుట్టిపడాలి. ఆనందము నీలో వుట్టిపడాలంటే సత్యమార్గంలో ప్రవేశించాలి. సత్యమార్గంలో నీవు ప్రవేశించాలంటే,

sri sathyasai vahini / vachanamrutam

శాంతితో నిండిన హృదయాన్ని కల్గివుండాలి. శాంతి హృదయము నీలో వుండాలంటే, ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. ప్రేమతత్త్వము రావాలంటే నీవు విశ్వాసము కలిగివుండాలి. కాని, యీనాటి మన faith ఎలా వుంటోంది? See-Saw మాదిరి ఊగుతూ వుంటుంది. ఈ ఆటలాడిన వారికి ఆ ఆటకూడను సహజమే! ఒక నిముషము పైకి, ఒక నిముషము క్రిందకి. పునరపి జననం, పునరపి మరణం. ఆ నమ్మకము పుడుతుంది, చస్తుంది. ఇలాంటి పుట్టి చచ్చేటువంటి నమ్మకాలతో పుట్టిచావని దైవత్వాన్ని పొందటం సాధ్యమవుతుందా?

**చావుపుట్టుక లేనట్టి శాశ్వతుండు**
**ఆదిమధ్యాంత రహితుడనాదివాడు**
**తాను చావక పుట్టక చంపబడక**
**అంతటను సర్వసాక్షియై అలరుచుండు.**

నీ నమ్మకము చచ్చిపుట్టినట్లుగా, దైవత్వముకూడా చచ్చిపుట్టేదికాదు. ఈ GOD ను ఏ పేరుతోనైనా పిలుచుకోవచ్చును. కనుక, దైవమునకు పెట్టిన పేర్లేగాని పుట్టిన పేర్లుకావు. ఋషులుకూడను 'శివః' అన్నారు, 'శంకరః' అన్నారు, 'ఆదిత్యః' అన్నారు, 'సంభవః' అన్నారు, 'స్వయంభుః' అన్నారు, అనేక పేర్లు వారు పెట్టినవేగాని భగవంతుడు తాను పెట్టుకొనిరాలేదు.

**దైవాన్ని మనం ఆశ్రయించినప్పుడే, దైవం మనలను ఆవరించి వుంటాడు**

మన దృష్టికి గోచరించే, గోచరించని Nature is God. Energy is God. Everything is God. మనము nothing అనే దానిలోనే అన్నీ యిమిడి వుంటున్నాయి. కనుక యీ జగత్తులో everything అన్నీవున్నాయి. అన్నీ వుంటున్నాయని మనము ఆశపడుతున్నాము. చాలా పొరపాటు. ఇది nothing. 'దైవంలేడు, దైవంలేడు, అక్కడ nothing, nothing' అంటున్నారు. కానీ everything అక్కడే వుంటోంది. ఉన్నదానిని లేదని చెపుతున్నాడు నాస్తికుడు. 'There is .... no God'. 'There is' అనే వాక్యములో మొదట వచ్చింది. 'No God', next వచ్చింది. కాబట్టి వున్నదానిని లేదంటున్నాడు తాను. వాడే blind. చెప్పిన

srisathyasaivachanamrutam

మాటకు భిన్నముగా నడుచుకుంటున్నాడు. హృదయానికి, మాటకు, క్రియకు ఏకత్వము చేరాలి. అదే మనుష్యత్వము. The proper study of mankind is man.

ఈ విధంగా మనం చెప్పేదానిలో సత్యమనేది ఇమిడి వుండినప్పటికినీ, ఆ సత్యాన్ని విస్మరించి, అసత్యాన్ని విశ్వసించి మన జీవితాన్ని వ్యర్థము చేసుకుంటున్నాము. దైవత్వమనేది సర్వత్ర వున్నాది. ఈ జగత్తే దైవస్వరూపము. దీనినే ఋషులు చక్కగా పరిశోధనలు జరిపి యీ దైవత్వమే విత్తనము అన్నారు. సమస్త సృష్టికికూడను యీ దైవత్వమే విత్తనముగా భావించుకుంటూ వచ్చారు. ఇక్కడ చక్కగా మనం గుర్తించాలి. ప్రతీ విత్తనమునకుపైన పొట్టు వుంటుంది. ఈ విత్తనము, పొట్టు రెండూ చేరినప్పుడే యిది మొక్కగా బయలుదేరుతుంది. ఒక paddy bag వున్నదనుకోండి. దీనిని paddy అని ఎప్పుడంటాము? With husk-paddy. Without husk-Rice. ఒక్కొక్క సమయములో పైపొట్టు రాలిపోతుంది. కొన్ని గింజలు పైపొట్టుతో కరచుకొని వుంటాయి. అవే విత్తనముగా తిరిగి మొలకెత్తుతాయి. యీ లోపల వుండే విత్తనమే ఆత్మస్వరూపుడైన భగవంతుడు, పైపొట్టుయే ప్రకృతి. ప్రకృతి, పరమాత్మ ఏకంగా వున్నదే యీ జగత్తు. ఈ జగత్తునందు సృష్టి జరుగుతున్నది. కనుక యీ జగత్తు పైపొట్టు, దీనికి దైవత్వమనే లోపల విత్తనము, రెండింటికి ఏకత్వం అనేది ఒకటి వున్నది యిక్కడ. పొట్టు నాశ్రయించి విత్తనం, విత్తనం ఆధారముగా చేసుకొని పొట్టు వుంటున్నాయి. కనుక దైవాన్ని మనము ఆశ్రయించి వున్నప్పుడే, దైవం మనలనావరించి వుంటాడు. దాసత్వం, దైవత్వం రెండింటియొక్క ఏకత్వమే దివ్యత్వమని నిర్ణయించుకోవాలి. దీనినే శివశక్త్యాత్మక స్వరూపమన్నారు. జగత్తు దైవ రహితంకాదు. దైవ సహితముగావుంది.

**'పిచ్చివాళ్లలో అగ్రగణ్యుడు దేవుడు'**

దీనినే Science లో Matter and Energy అన్నారు. ప్రతీ matter లోకూడను energy వుంది. ప్రతీ energy లో ఒక matter వుంది. అది క్రమక్రమేణా తరుగుతుంది. తిరిగి matter లో చేరుతూవుంటుంది. ఈ రెండింటి సంబంధ బాంధవ్యమే ప్రకృతి, పరమాత్మ స్వరూపము. కనుక, energy అనేదికూడను దైవానికి ఒక పేరు. ప్రకృతి అనేదికూడను

sri sathyasaivachanamrutam

దైవానికి ఒక పేరు. శూన్యము అనేదికూడా దైవమునకు ఒక పేరు. ఈశ్వరునికి మరొక పేరుకూడను కల్పించుతూ వచ్చారు, జగత్తులో. మీరు చూడండి: ప్రశాంతినిలయములో దైవందైవం అని చింతించే వారినంతా బయటవున్నవాళ్లు ఏమిరా వీడుపిచ్చివాడు. సాయిబాబా పిచ్చిపట్టింది అని మిమ్మల్ని పిచ్చివాళ్లుగా భావిస్తుంటారు. మీరేమనుకుంటారు? యిక్కడకురాకుండా, దీనిని ద్వేషించే వాళ్లంతా పిచ్చివాళ్లని వాళ్లను మీరు పిచ్చివాళ్లు అంటున్నారు. మొత్తముమీద మిమ్మల్ని వాళ్లు పిచ్చి అని, వాళ్లని మీరు పిచ్చి అని యిద్దరూ పిచ్చివాళ్లే! అయితే ఎలాంటి పిచ్చి? 'దైవపిచ్చి మీది, లోకపిచ్చి వారిది'. పిచ్చాసుపత్రిలో రకరకాలైన పిచ్చి వాళ్లుంటారు. ఒకరిని తిట్టేవారు, ఒకరిని కొట్టేవారు, ఒకరిని ఉమ్మివేసేవారు, గలాటాచేసేవారు ఎన్ని రకాలుగానో వుంటారు. కాని అందరికంటే ఏదో ఒక మూల కూర్చుని శాంతంగా వుండే పిచ్చివానివల్ల డాక్టరుకుకూడా సుఖమే కదా! అందువల్లనే యీ ఋషులంతా చక్కగా ప్రకృతిని పరిశీలించి "ప్రకృతిలో అందరు రకరకాల పిచ్చివాళ్లే, కాని అందరికంటే పిచ్చివాడు, గొప్పవాడు ఒకడున్నాడు. అతనిని 'ఉన్మత్తశేఖరాయనమః', 'పిచ్చివాళ్లలో అగ్రగణ్యుడు దేవుడ'న్నారు. 'ఉన్మత్తుడు' అంటే పిచ్చివాడు. వాళ్లలో అగ్రగణ్యుడు యీశ్వరుడు. ఎందుకోసం పిచ్చివాడంటే, 'అర్కద్రోణప్రియాయనమః'. ఉమ్మెత్తపూలు, జిల్లేడుపూలు అంటే అతనికి చాలా యిష్టమట, పాపం! అవి పిచ్చిని పట్టించేవిట! పిచ్చివాడు కనుకనే 'ఉన్మత్తశేఖరాయనమః', 'అర్కద్రోణప్రియాయనమః', తుమ్మిపూలు, జిల్లేడుపూలు ఈశ్వరునికి చాలా యిష్టమట!

ఇందులో చక్కని ఆదర్శమును మనం తీసుకోవాలి. లోకములో పాపములు చేయనటువంటివారు నల్గురు- బాల, ఉన్మత్త, జ్ఞాని, పిశాచి. 'బాలోన్మత్తజ్ఞానపిశాచవత్' అన్నారు. బాలుడు వీనికి యేమితెలియదు, తాను తెలిసి పాపం చేయడు. జ్ఞానికి సర్వత్రా దైవత్వమే! కనుక అతను ఎట్టిపాపములోను ప్రవేశించడు. పిచ్చివారు తెలిసి పాపములు చేయనివారు కనుక, వారిలో పాపమేమాత్రం వుండదు. పాపములు చేయనివానికి పుణ్యం నిండుగా వుంటుంది. కనుక, యీ పిచ్చివాళ్లలో అగ్రగణ్యుడు ఈశ్వరుడు. ఆయనకు ఎట్టి పాపములు అంటుకోవు. ఆయన నిరంతరము పరిశుద్ధమైనవాడే! సర్వమూ పుణ్యముతోనే కూడివుంటున్నాడు. ఈ సంసారమనే, లోకవ్యవహారమనే బురదలో చిక్కుకున్నవానిని

గట్టునున్నవాడే లేవనెత్తగలడు. ప్రాకృత సంబంధమైన విషయవాసనలలో మునిగిన మానవులందరినీ గట్టున జేర్చి వారిని పైకి లాగేవాడు కనుక, ఈశ్వరుడు. అతనిని 'ఉన్మత్తశేఖరాయనమః' అన్నారు.

దైవముయొక్క విశిష్ఠతనుగాని, గుణగణములనుగాని, శక్తి సామర్థ్యములనుగాని యిట్టివి, అట్టివి అని వర్ణించటము ఎట్టివారికీ సాధ్యముకాదు. అందువల్లనే 'అవాఙ్మానసగోచరుడు', 'యథోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ', అని దివ్యత్వమును వర్ణించారు. అతనిని వర్ణించటానికి సాధ్యము కాదని గుర్తించి, ఏదో పవిత్ర మార్గములో ప్రవేశించి నిరంతరము దివ్యనామాన్ని స్మరిస్తూ వచ్చారు.

పవిత్రమైన యీ శివరాత్రి రోజున దైవనామ చింతనచేత సాధ్యమైనంతవరకు విషయవాసనలలో ప్రవేశించకుండా వుండే నిమిత్తమై మనసుని భగవంతుని యందు యిమిడ్చి, దానియందే లగ్నపరచి, యీ రాత్రిని సార్థకముగావించుకొని, మీయొక్క జన్మమును పవిత్రం చేసుకోవాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 8-03-1986న పూర్ణచంద్ర సభా మంటపంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam